
సాక్షి
మహబూబాబాద్
శనివారం | 21 | జనవరి | 2023



నీవెంటే నేను! - 8లో▸
బాల్యం నుంచి కలిసిమెలిసి పెరిగారు. ఇప్పుడు 24 గంటల వ్యవధిలోనే ఇద్దరూ మృత్యు ఒడికి చేరుకున్నారు. నీవెంటే నేను అంటూ అనంత లోకాలకు వెళ్లిపోయారు.



నేటి నుంచి రీ ఓపెన్ అయ్యేనా?
కేయూలో విద్యార్థులకిచ్చిన 11 రోజుల సెలవులు శుక్రవారంతో ముగిశాయి. అయితే కామన్ మెస్, పలు హాస్టళ్లలో మరమ్మతులు కొనసాగుతున్నాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.8^0/16.3^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మంచుతో పాటు చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం గాలులు వీస్తాయి.

పైసలు పడలే..

- ధాన్యం డబ్బులు చెల్లింపులో జాప్యం
- నెలలు గడిచినా పలువురి రైతులకు అందని వైనం
- ఇతర జిల్లాల మిల్లులకు పంపిన ధాన్యం డబ్బులు ఆలస్యం
- యాసంగి పెట్టుబడుల కోసం రైతన్నల ఇబ్బందులు



సాక్షి, మహబూబాబాద్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరతోపాటు, దళారుల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. చాలా చోట్ల ధాన్యం కొనుగోళ్లు, డబ్బులు చెల్లింపులు సజావుగానే సాగాయి. అయితే కొన్నిచోట్ల డబ్బుల చెల్లింపుల్లో ఆలస్యమవుతుండడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఈమేరకు వానాకాలం సీజన్‌లో రైతులు అమ్మిన ధాన్యం డబ్బులు ఇప్పటి వరకు రాలేదు. దీంతో కొనుగోలు కేంద్రాలు, నిర్వాహకులు, అధికారుల చుట్టూ వారు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని మిల్లులకు కాకుండా ఇతర జిల్లాలకు ఎగుమతి చేసిన ధాన్యం డబ్బుల చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

నెలలు గడిచినా..
ధాన్యం అమ్మి నెలలు గడిచినా డబ్బులు చెల్లించలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా ఐకేపీ 64, పీఏసీఎస్ 153, జీసీసీ 11, మెప్మా రెండు, డీహెచ్ఎస్ఓ మూడు, ఏఎంసీ ఒక కేంద్రం మొత్తంగా 234 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండు నెలలుగా సాగుతున్న ధాన్యం కొనుగోళ్లల్లో ఇప్పటి వరకు 40,155 మెట్రిక్ టన్నులు గ్రేడ్-ఏ, 174,841 మెట్రిక్ టన్నులు కామన్ రకం మొత్తంగా 214,996 మెట్రిక్ టన్నుల ధాన్యం 38,639 మంది రైతుల వద్ద కొనుగోలు చేశారు. ధాన్యం విలువ రూ. 441,43,60,472 ఉంటుంది. ఇప్పటి వరకు 35,950మంది రైతుల వివరాలను ఆన్‌లైన్ చేశారు. ఇందులో 33,045 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. కాగా ఇప్పటి వరకు 2,689మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ చేయలేదు. 2,905 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ చేసినప్పటికీ డబ్బులు చెల్లించలేదు. ఇలా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 5,594 మంది రైతులు అమ్మిన 47,609 మెట్రిక్ టన్నుల ధాన్యం డబ్బులు రూ. 97,30,12,984రావాల్సి ఉంది.

ఇతర జిల్లాలకు ఎగుమతితో..
ఈ వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం ఇతర జిల్లాలకు కూడా పంపించింది. జిల్లాలోని మిల్లులకు పంపిన ధాన్యానికి సకాలంలో డబ్బులు రాగా.. ఇతర జిల్లాలకు పంపిన ధాన్యం డబ్బుల చెల్లింపుల్లో మాత్రం జాప్యం జరుగుతోంది. ఈ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు 1.84లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా.. ఇప్పటివరకు అంచనాలకు మించి 2,14,996 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చింది. జిల్లాలో 234 సెంటర్లకు గాను ఇప్పటికే 205 సెంటర్లు మూసివేశారు. మరో 29 కేంద్రాల ద్వారా మరింత ధాన్యం వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో ధాన్యం ఎగుమతిలో ఎలాంటి సమస్యలు రావొద్దని వరంగల్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు ధాన్యం తరలించారు. ఇలా ఇప్పటి వరకు అధిక మొత్తంలో ధాన్యం ఇతర జిల్లాలకు ఎగుమతి చేసినట్లు సమాచారం. కాగా ఈ ధాన్యానికి సంబంధించిన ఆర్ఓలను అధికారులు పంపించలేదు. దీంతో బిల్లులు ఆగిపోయాయి. కాగా యాసంగి పెట్టుబడి కోసం రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

నెలరోజులైనా డబ్బులు రాలేదు



నేను పండించిన మొత్తం ధాన్యం 196 క్వింటాళ్లను మా ఊరి కొనుగోలు కేంద్రంలో అమ్మిన. నెల రోజులు దాటింది. కానీ నాకు డబ్బులు రాలేదు. కొనుగోలు కేంద్రం మూసివేశారు. కానీ నా డబ్బులు రాలేదు. ఎవరిని అడిగినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి డబ్బులు వచ్చేలా చూడాలి.

-వేముల విజయ్‌పాల్, రెడ్డి, నర్సింహులపేట

యాసంగి పెట్టుబడికి ఇబ్బంది



నా పొలంలో పండిన ధాన్యం 36క్వింటాళ్లను కురవి రైతు సేవ కేంద్రంలో నెల రోజుల క్రితం అమ్మిన. కానీ ఇప్పటి వరకు నా ఖతాల్లో డబ్బులు పడలేదు. ఎవరిని అడిగినా పట్టించుకోవడం లేదు. యాసంగి సీజన్ ప్రారంభమైంది. పెట్టుబడికోసం అప్పులు తేవాల్సి వస్తుంది. త్వరగా డబ్బులు వచ్చేలా చూడాలి.

-గుమ్మళ్ల వీరన్న, రైతు, కురవి

వారం రోజుల్లో డబ్బులు వస్తాయి



ఇతర జిల్లాలకు అనుకున్న దానికంటే ఎక్కువగా ధాన్యం ఎగుమతి చేశాం. సూర్యాపేట, నల్ల గొండ జిల్లాలోని మిల్లులకు పంపిన ధాన్యం డబ్బులు ఆగిపోయాయి. నెల గడిచినా డబ్బులు రావడంలేదని రైతుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. వారం రోజుల్లో డబ్బులు వస్తాయి.

-నర్సింగరావు, డీఎస్ఓ

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు



మరిపెడలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

మరిపెడ: తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీజేపీ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మరిపెడలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి లేకనే ప్రజలు కేసీఆర్ పాలనను కోరుకున్నారన్నారు. ఇక బీజేపీ కొత్తగా రాష్ట్రంలో చేరి చిల్లర రాజకీయాలు చేస్తుందన్నారు. ఇక్కడి ప్రజలు వచ్చే ఎన్నికల్లో మిమ్ములను చిత్తుగా ఓడిస్తారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, గంధసిరి అంబరీష, అప్జల్, బానోత్ రాంలాల్, కొంపెల్లి వేణుగోపాల్‌రెడ్డి, పాదూరి శ్రావణ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అలువాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్సీ విరాళం
మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణ బొడ్రాయి పునఃప్రతిష్టాపన కోసం రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్ రూ.2,00,116, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు రూ.1,00,016 విరాళం అందజేశారు. బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విరాళాల సేకరించారు. అనంతరం బొడ్రాయి గద్దె నిర్మాణ పనులను కమిటీ సభ్యులు పరిశీంచారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మాలె నాగేశ్వర్‌రావు, ఎడ్ల రమేష్, బోనగిరి గంగాధర్, ఆకుల హరిప్రసాద్, పిల్లి సుధాకర్ తదితరులు ఉన్నారు.

వివాదాస్పదంగా డీపీఓ పోస్టింగ్

- ఒకరి పేరుమీద ఉత్తర్వులు.. మరొకరికి పోస్టింగ్

మహబూబాబాద్: డీపీఓ పోస్టింగ్ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ ఉత్తర్వులో ఒకరి పేరు ఉండగా.. మరొకరికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం వివాదాస్పదమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలో పని చేసిన డీపీఓ సాయిబాబా ఇటీవల మెదక్ జిల్లాకు బదిలీ అయ్యారు. మానుకోట జిల్లాకు వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న స్వరూపను కేటాయించగా.. ఆమె ఈ నెల 9న డీపీఓ కార్యాలయంలో రిపోర్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో కూడా రిపోర్టు చేయడానికి వెళ్లినట్లు తెలిసింది. అయితే ఈ క్రమంలో ఏమీ జరిగిందో ఏమో.. ఈ నెల 19న మరిపెడ ఎంపీడీఓగా పనిచేస్తున్న ధన్‌సింగ్‌కు ఇన్‌చార్జ్ డీపీఓ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అదే రోజు ఆయన బాధ్యతలు స్వీకరించారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాలను కలెక్టర్ ధిక్కరించి మరొకరికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారనే వార్త జిల్లాలో వైరల్‌గా మారింది. అయితే ఆశాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఉత్తర్వులను మార్పు చేసి ఇచ్చే అధికారం కలెక్టర్‌కు ఉందా అనే విషయంపై జిల్లా అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. లేక పైనుంచి మరేమైనా ఉత్తర్వులు వచ్చాయా అనే విషయంపై క్లారిటీ లేదు. లేదా రాజకీయ జోక్యంతో ఏమైనా మార్పులు చేశారా అనేది తెలియాల్సి ఉంది.

రేపు 'తానా' రాష్ట్ర సదస్సు

ఎంజీఎం : ఈ నెల 22న హనుమకొండలోని ఐశ్వర్యగార్డెన్‌లో తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్ అసోసియేషన్ (తానా) 8వ రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ రాష్ట్ర ఎలక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ రాకేశ్ తెలిపారు. శుక్రవారం వరంగల్ ఐఎంఏ హాల్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. సదస్సుకు మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, మేయర్ సుధారాణి, ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, తాటికొండ రాజయ్యలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎలక్ట్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన డాక్టర్ రాకేశ్ రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలు స్వీకరించి సంవత్సరంపాటు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు పేదలకు మెరుగైన సేవలు ఎలా అందించాలో అనే విషయాన్ని చర్చించనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

కంటి వెలుగు శిబిరం సందర్శన



బయ్యారం: మండలంలోని వెంకటాపురం(లక్ష్మీపురం)లోని కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరంపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చలపతిరావు, సర్పంచ్ కృష్ణవేణి, వైద్యుడు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కంటి విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు



మహబూబాబాద్: ప్రజలు కంటి విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని ట్రైనీ కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, కంటి పరీక్షలు కూడా చేయించుకున్నారు. ఈసందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంధత్వ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరు పరీక్ష చేయించుకుంటే సమస్య బయటపడుతుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి ప్రసన్నరాణి, వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, ఏఈ సురేష్, మెప్మా డీఎంసీ విజయ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి



కొత్తగూడ: కంటి పరీక్షల కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండాచూడాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఇప్పటివరకు ఎంతమందికి పరీక్షలు చేపట్టారు, ఎంతమందికి కంటి అద్దాలు ఇచ్చారు, ఆపరేషన్‌లకు ఎంతమందిని గుర్తించారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివప్రసాద్, ఆప్తాలమిస్ట్ శ్యాంసుందర్ ఉన్నారు.

బదిలీలు, పదోన్నతులు కల్పించాలి

గూడూరు: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని బీసీ ఉపాధ్యాయ సంఘం (బీసీటీయూ) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గునిగంటి రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీ జనగణన చేపట్టాలని, 56 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, 317 జీఓ ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు భవిష్యత్‌లో వారి సొంత జిల్లాకు వచ్చేలా ప్రత్యేక జీఓ తీసుకురావాలని డిమాండ్ చేశారు.. ఉపాధ్యాయులందరికీ ఆరోగ్య కార్డులు అందించి, నగదు రహిత వైద్యం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నేడు కెమిస్ట్రీ గెస్ట్ ఫ్యాకల్టీకి ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో అతిథి అధ్యాపకులుగా (గెస్ట్ ఫ్యాకల్టీ) పనిచేసేందుకు ఆసక్తిగల అభ్యర్థులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11గంటలకు కళాశాలలో తమతమ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు పీజీ కోర్సుల్లో 55శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్ లేదా సెట్ లేదా పీహెచ్‌డీ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. ఫిజికల్ కెమిస్ట్రీ స్పెషలైజేషన్ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి



జయపురంలో మిర్చి పంటను పరిశీలిస్తున్న డీఏఓ ఛత్రునాయక్

నర్సింహులపేట: రైతులు పంటల సాగులో మెళకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఛత్రునాయక్ అన్నారు. యాసంగి పంటల వివరాల నమోదు ప్రక్రియలో భాగంగా శుక్రవారం జయపురం, బాసుతండా, బక్కతండాలో పంటలను పరిశీలించారు. వరి సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. చలి తీవ్రతతో వరినారు చనిపోతుందని, ఇందుకు జింక్ సల్ఫేట్ రెండు గ్రాములను నీటిలో కలిపి స్ప్రే చేయాలని సూచించారు. ఎకరాకు రెండు కేజీల యూరియా వేయాలని, నాటు వేసే వారంరోజుల ముందు మూడు కేజీల గుళికలను నారుమడిలో చల్లాలని సూచించారు. వరి నాటిన 24గంటలలోపు కలుపు మందు చల్లాలని, 20రోజుల తర్వాత నామిని గోల్డ్ కలుపు మందును పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ రామకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలి



పాఠశాలలో మాట్లాడుతున్న సరోజినీదేవి

డోర్నకల్: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని మోడల్ స్కూల్స్ జేడీ పాలడుగు సరోజినీదేవి అన్నారు. మండల కేంద్రంని జెడ్పీహెచ్ఎస్‌తో పాటు చిలుకోడు మోడల్ స్కూల్‌లో శుక్రవారం సరోజినీదేవి సందర్శించారు. పాఠశాలల్లో వసతులను పరిశీలించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. త్వరలో జరగబోయే పరీక్షలకు విద్యార్థులు మానసికంగా, శారీరకంగా సిద్ధం కావాలని కోరారు. పీఎం శ్రీ పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారనున్నాయన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ విత్తనాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి



అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం వెయ్యి బస్తాల మిర్చి అమ్మకానికి వచ్చింది. ఈ సీజన్‌లో మొదటిసారిగా అత్యధికంగా మిర్చిబస్తాలు అమ్మకానికి రావడంతో పెద్ద షెడ్డు నిండిపోయింది. కాగా క్వింటా మిర్చి గరిష్ట ధర రూ.19,711, కనిష్ట ధర రూ.16,022 పలుకగా, తాలురకానికి గరిష్ట ధర రూ.10,111, కనిష్ట ధర రూ.8,511పలికినట్లు స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు తెలిపారు.

23నుంచి మిర్చి కొనుగోళ్ల ప్రారంభం
మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఈ నెల 23నుంచి మిర్చి కొనుగోళ్ల ప్రారంభిస్తామని ఏఎంసీ సెక్రటరీ రాజేందర్ శుక్రవారం తెలిపారు. రైతులు తమ సరుకును ఉదయం 8గంటలలోపే మార్కెట్ యార్డుకు తీసుకురావాలని సూచించారు. నాణ్యమైన, తేమ లేని మిర్చిని తీసుకొచ్చి మంచి ధర పొందాలన్నారు. మార్కెట్ యార్డులో సరిపడా స్థలం లేనందున ప్రతిరోజు 3,500 నుంచి 4,000 బస్తాల వరకే తూకం వేస్తామని తెలిపారు. రాత్రి 10గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8గంటల లోపు రైతులు తమ సరుకులను మార్కెట్‌కు తీసుకురావాలని చెప్పారు.

గద్దెల ప్రాంగణంలో వెలుగులు



విద్యుత్ కాంతులతో ప్రధాన ద్వారం

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా మేడారం సమ్మక్క– సారలమ్మ గద్దెల ప్రాంగణ ప్రాంతాలు హైమాస్ట్ దీపాలతో కాంతులీనుతున్నాయి. ఫిబ్రవరిలో జరిగే మినీ మేడారం జాతర సందర్భంగా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో సమ్మక్క– సారలమ్మ గద్దెల ప్రాంగణం, సాలహారం చుట్టూ లైట్లను ఏర్పాటు చేశారు.

పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలి

- కలెక్టర్ శశాంక



కురవి: కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించి వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

కురవి: ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ శశాంక సూచించారు. శుక్రవారం మండలంలోని కందికొండ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. వైద్య సిబ్బంది ఉదయం 8.30గంటలకే కేంద్రంలో ఉండాలని ఆదేశించారు. 18ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు మురళీధర్, ఉమాగౌరీ, ఎంపీడీఓ సరస్వతీ, తహసీల్దార్ ఇమ్మానీయేల్, డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, సర్పంచ్ వడ్డూరి పద్మ పాల్గొన్నారు.

మరిపెడలో..
మరిపెడ రూరల్: ప్రజలు కంటి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం మరిపెడ మండలం గిరిపురం గ్రామ రైతు వేదికలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మురళీధర్, ఎంపీడీఓ ధన్‌సింగ్, తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, మరిపెడ పీహెచ్‌సీ వైద్యులు గుగులోతు రవి, ఏపీఎం రాములు, సర్పంచ్ పెద్దబోయిన జనార్దన్, గ్రామ పెద్దలు శాస్త్రి, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, వైద్య శిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి..
మహబూబాబాద్: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో విద్యా ప్రమాణాలపై విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. సమావేశంలో డీఈఓ రామారావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం..
జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని కలెక్టర్ శశాంక తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మానుకోట కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శశాంక, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బూత్‌స్థాయి అధికారులకు అవగాహన కల్పిస్తూ అత్యధిక ఓటర్ల నమోదుకు కృషి చేస్తున్నామన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. వీసీలోఅదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓలు కొమురయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాను రూపొందించాలి



మాట్లాడుతున్న బాలమాయాదేవి

మహబూబాబాద్: ప్రత్యేక ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని ఓటరు జాబితా పరిశీలకురాలు బాలమాయాదేవి ఆదేశించారు. శుక్రవారం నూతన కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శశాంకతో కలిసి ప్రత్యేక ఓటరు జాబితా రూపకల్పనపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా బాలమాయాదేవి మాట్లాడుతూ.. రూపొందించిన జాబితాను బీఎల్ఓ స్థాయిలో పరిశీలించాలన్నారు. ఓటరుకార్డును ఆధార్‌తో లింక్ చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సహాయ ఎన్నికల అధికారులు పర్యవేక్షించి తొలగించిన ఓటర్ల నివేదికపై వివరణ ఇవ్వాలన్నారు. పీడబ్ల్యూడీ ఓటర్ల మార్కింగ్ చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓలు కొమురయ్య, రమేష్, నోడల్ అధికారి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ డీపీఓగా ధన్‌సింగ్

మహబూబాబాద్: జిల్లా ఇన్‌చార్జ్ డీపీఓగా మరిపెడ ఎంపీడీఓ దన్‌సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా జిల్లాలోని సీనియర్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ధన్‌సింగ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రంజిత్ ఇన్‌చార్జ్ డీపీఓను కలిసి పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కోరాడు.

ఆరుబయట విద్యార్థుల చదువులు..



పాఠశాలల తరగతి గదుల్లో కంటి వెలుగు పరీక్షలు నిర్వహిస్తున్నందున విద్యార్థులు ఆరుబయట పాఠాలు వినాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలోని గుమ్మడూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మూడు గదులు కేటాయించగా.. ప్రస్తుతం రెండు గదుల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో కొంత విద్యార్థులను వరండాలో.. మరికొందరిని ఆరుబయట కూర్చోబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు.

-సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

16మంది విద్యార్థుల డీబార్



విద్యారణ్యపురి: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ కోర్సుల మూడవ సెమిస్టర్ పరీక్షల్లో వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 16మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

వందేభారత్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాశిబుగ్గ: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం జరిగింది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40–45 ఏళ్ల మధ్య వయస్సు, 5.5 ఎత్తు, నీలం రంగు టీషర్టు, గ్రే కలర్‌పాయింట్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి హంటర్ రోడ్డు సంతోషిమాత గుడి ఎదురుగా ఉన్న రైలు ట్రాక్‌పై పట్టాలు దాటుతుండగా.. వందేభారత్ రైలు ఢీకొట్టింది. మృతుడి శరీరంలో స్టీల్ రాడ్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు, మృతుడి వివరాలు తెలిస్తే వరంగల్ జీఆర్పీ స్టేషన్ లేదా 94406 04320, 94406 27532 నంబర్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

స్పెల్‌బీ విజేతలకు ప్రశంసపత్రాల అందజేత

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి రీజినల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం రాంపూర్ యూనిట్ కార్యాలయంలో ప్రశంసపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వైద శ్రీనివాస్, ఎడిషన్ ఇన్‌చార్జ్ వర్ధెల్లి లింగయ్య, ఈవెంట్స్ ఇన్‌చార్జ్ సుమన్, ఫొటో జర్నలిస్టు సంపెట వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP — SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor
SUDHAKAR PIPES AND FITTINGS — LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..
ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..
ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...
ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.
జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..
ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన
ఫోన్ నంబర్లు : 95055 14424
గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

కామన్ మెస్ రీ ఓపెన్ అయ్యేనా?

- కేయూలో నేటితో ముగిసిన సెలవులు
- కొనసాగుతున్న మరమ్మతులు

కేయూ క్యాంపస్: కేయూలో పీజీ తదితర కోర్సుల విద్యార్థులకిచ్చిన 11 రోజుల సెలవులు శుక్రవారంతో ముగిశాయి. సంక్రాంతి సెలవుల పేరున హాస్టళ్లు, మెస్‌లలో మరమ్మతుల నేపథ్యంలో సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనెల 21 నుంచి రీ ఓపెన్ చేయాల్సి ఉండగా.. కామన్ మెస్‌లో, పలు హాస్టళ్లల్లో ఇంకా మరమ్మతులు కొనసాగుతున్నాయి. పలు విభాగాల్లో పెయింటింగ్ వేయిస్తున్నారు. కేయూ హాస్టళ్ల కమిటీ చైర్మన్ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్‌లాల్, పాలక మండలి సభ్యులు పి.మల్లారెడ్డి, కేయూ అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య వాసుదేవరెడ్డి, యూజీసీ కో–ఆర్డినేటర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి సమావేశమై చర్చించారు. కామన్ మెస్‌ను సందర్శించి పరిశీలించారు. మరమ్మతుల నేపథ్యంలో పీజీ విద్యార్థులకు (బాయ్స్)కు అందులో కామన్ మెస్‌లో మెస్ సౌకర్యాన్ని ప్రారంభించే అవకాశం లేదని గుర్తించారు. మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉండడంతో ఆయా విద్యార్థులకు ప్రత్యామ్నాయంగా మరోచోట ఏర్పాటు చేయాలని చర్చించారు. అందుకు కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్ లోని స్థలంలో మెస్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనేది కూడా చర్చించినట్లు సమాచారం. శుక్రవారం సాయంత్రం 7గంటల వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే మహిళా హాస్టల్ లోనూ మరమ్మతులు కొనసాగుతున్నాయి. దీంతో రీఓపెన్ ఉంటుందా లేదా? అనేది కూడా యూనివర్సిటీ అధికారులు ప్రకటించలేదు. ఇక సెలవులు పొడిగించవద్దనే చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కానీ నిర్ణయాన్ని ప్రకటించడం లేదు. సెలవులు ముగిసినందున ఈనెల 21నుంచి తరగతులు యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది ఈనెల 21 నుంచి విద్యార్థులు అయితే క్యాంపస్‌కు చేరుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. సోమవారం వరకు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. సెలవులు పొడిగిస్తే విద్యార్థుల నుంచి వ్యతిరేకిత వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే 11 రోజులు సెలవులు ప్రకటించినప్పుడే తమకు మూడ్రోజులు సెలవులు చాలు 11 రోజులు వద్దని ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈనెల 21 నుంచి యథావిధిగా పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి స్పష్టం చేశారు.

మరమ్మతులంటూ విద్యార్థులను నిరాకరించిన సిబ్బంది

కాకతీయ యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగానికి చెందిన విద్యార్థులు(మహిళలు) సుమారు 12 మంది ఈనెల 21 నుంచి రీఓపెన్ ఉంటుందని భావించి శుక్రవారం సాయంత్రం యూనివర్సిటీకి వచ్చినట్లు సమాచారం. మహిళా హాస్టల్‌కు వెళ్లగా మరమ్మతులు జరుగుతున్నాయని లోనికి సంబంధిత సిబ్బంది నిరాకరించడంతో వారు ఆవేదనతో వెనుదిరిగినట్లు సమాచారం. మైక్రోబయాలజీ విభాగాధిపతి తప్పనిసరిగా ఈనెల 21న క్లాస్‌కు హాజరు కావాలని విద్యార్థులకు మెసేజ్‌లు పంపినట్లు తెలుస్తోంది. అయితే మెస్‌లు రీఓపెన్ అవుతాయో లేదో అని కూడా విద్యార్థినులు అనుమానం వ్యక్తం చేసినప్పటికీ మీరు హాజరు కావాల్సిందేనని సమాచారం పంపినట్లు తెలుస్తోంది. దీంతో ఆయా విద్యార్థులు క్యాంపస్‌కు వచ్చినట్లు సమాచారం. సెలవులు ముగిసినందున ఈనెల 21 నుంచి మెస్‌లు రీ ఓపెన్ చేస్తారా? అని కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావును 'సాక్షి' శుక్రవారం సాయంత్రం వివరణ కోరగా.. తాము వివిధ హాస్టళ్ల మెస్‌లను సందర్శించి మరమ్మతులు ఎలా జరుగుతున్నాయో.. పరిశీలించామని తెలిపారు. మహిళా హాస్టల్ మెస్‌లకు ఎలాంటి ఇబ్బంది లేదని, తెరిచే అవకాశం ఉందని బాయ్స్ కామన్ మెస్‌లోనే మరమ్మతులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయం చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని శ్రీనివాస్‌రావు వివరణ ఇచ్చారు.

విద్యార్థి, ఉపాధ్యాయులకు కలెక్టర్ అభినందన



సాయిలేఖ్యను అభినందిస్తున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్ రూరల్: ప్రతిష్టాత్మక యంగ్ ఇన్నోవేటర్ ప్రోగ్రామ్ (వైఐపీ 2023) కార్యక్రమంలో పాల్గొన్న కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఈ.సాయిలేఖ్య, ఆమెను ప్రోత్సహించిన గైడ్ టీచర్ డాక్టర్ వి.గురునాథరావు, పాఠశాల హెచ్‌ఎం ఎస్.రమేశ్‌బాబును కలెక్టర్ కె.శశాంక శుక్రవారం అభినందించారు. మహబూబాబాద్ కలెక్టరేట్లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, జిల్లా విద్యా శాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి బుచ్చయ్య, జిల్లా విద్యా శాఖ ఏసీజీఈ మందుల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. కాగా.. వైఐపీని హైదరాబాద్‌లో జనవరి 3 నుంచి 13 వరకు సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) నిర్వహించగా.. రాష్ట్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి సాయిలేఖ్య ఎంపికైంది. పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు డాక్టర్ వి.గురునాథరావు ఆధ్వర్యంలో పాల్గొంది.

నీవెంటే నేను!



రవీందర్, జలేందర్ (ఫైల్)

- మృత్యువులోనూ వీడని బంధం
- 24 గంటల వ్యవధిలో అన్నాదమ్ముళ్ల మృతి
- లెంకాలపల్లిలో విషాదం

నల్లబెల్లి: పసిప్రాయంలో తండ్రిని కోల్పోయారు. ఆ లోటు తెలియకుండా తల్లి వారిని పెంచి పెద్ద చేసింది. బాల్యం నుంచి సోదరులు కలిసి పెరిగారు. ఇప్పుడు 24 గంటల వ్యవధిలోనే ఇద్దరూ మృత్యు ఒడికి చేరుకున్నారు. నీవెంటే నేను అంటూ ఇద్దరూ అనంత లోకాలకు వెళ్లిపోయారు. నల్లబెల్లి మండలం లెంకాలపల్లికి చెందిన రవీందర్ (40), జెలేందర్(37) 24 గంటల వ్యవధిలో మృతి చెందారు. బాల్యంలోనే వీరి తండ్రి వీరయ్య మృతి చెందాడు. కుమారుల్ని తల్లి రాజేశ్వరి కూలీ చేసి పెంచింది. కొంత కాలంగా పెద్ద కుమారుడు రవీందర్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పది రోజులుగా ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. కాగా.. అన్నను చూసి వచ్చేందుకు జెలేందర్ ఈనెల 18న వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు ఆస్పత్రి మెట్లపైనుంచి జారి పడి మృతి చెందాడు. ఈవిషయం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవీందర్‌కు తెలియకుండా కుటుంబ సభ్యులు జలేందర్ దహన సంస్కారాలు పూర్తి చేశారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న రవీందర్ సోదరుడి మృతిని తట్టుకోలేకపోయాడు. అది ఆరోగ్య పరిస్థితిపై ప్రభావం చూపడంతో వైద్యులు ఐసీయూకు తరలించి మెరుగైన వైద్యం అందించేందుకు యత్నిస్తుండగా మృతి చెందాడు. అన్నాతమ్ముళ్లు 24 గంటల వ్యవధిలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తమ కుటుంబాలను వదిలి వెళ్లారా అని కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు.

పలువురి పరామర్శ..
జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. రవీందర్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి, నాయకులు ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, పాలెపు రాజేశ్వర్‌రావు, మేకల లక్ష్మి, కక్కెర్ల శ్రీనివాస్, గన్నెబోయిన చేరాలు, కొత్తపల్లి అశోక్, కస్తూరి రవి, ఆకుల సాంబరావు ఉన్నారు.

బాలిక కిడ్నాప్ కలకలం

- కిరాణానికి వెళ్లిన బాలిక.. ముఖానికి కర్చీఫ్ పెట్టి కిడ్నాప్
- తప్పించుకుని క్షేమంగా ఇంటికి..
- పీఎస్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదు.. కేసు నమోదు
- కిడ్నాప్ కాదంటున్న పోలీసులు



తల్లి కౌసర్‌బేగంతో కుమార్తె బుతుల్

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే గేట్ ప్రాంతం కాశికుంటలో శుక్రవారం ఉదయం బాలిక కిడ్నాప్ కలకలం రేపింది. పాల ప్యాకెట్ కోసం కిరాణానికి వెళ్లిన 12 ఏళ్ల బాలికను గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకుని మత్తుతో కూడిన కర్చీఫ్ ముఖానికి అడ్డుపెట్టి ఆటోలో కిడ్నాప్ చేశారు. కుమార్తె ఎంతకూ తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కాశికుంటకు చెందిన ఎండి ఇమ్రాన్, కౌసర్ బేగం దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇమ్రాన్ టింబర్ డిపోలో మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఇమ్రాన్ తల్లి గౌసియా బేగం, అతడి అక్క సాహేదాబేగం వీరు ఇరువురు జక్కలొద్దిలోని సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటైన తాత్కాలిక గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 7.30గంటలకు కౌసర్ బేగం తన కుమార్తె బుతుల్(12)ను పాలప్యాకెట్ తీసుకురమ్మని జన్మభూమి రోడ్డులోని కిరాణం షాపునకు పంపింది. షాపునకు వెళ్తున్న క్రమంలో ముగ్గురు ఆగంతకులు బాలిక ముఖానికి కర్చీఫ్ అడ్డు పెట్టి కిడ్నాప్ చేసి ఆటోలో తీసుకెళ్లారు. కిడ్నాపర్లు ఆటోను వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి మీదుగా వరంగల్ హంటర్ రోడ్డులోని గణపతి కాలేజీ జక్కలొద్ది క్రాస్ రోడ్డు వరకు తీసుకెళ్లారు. అక్కడ కిడ్నాపర్లు టీతాగేందుకు ఆటోను నిలపగా.. మత్తు నుంచి తేరుకున్న బాలిక ఆటో దిగి పరుగు పెట్టింది. అంతలోనే అటుగా వెళ్తున్న గుడిసెవాసులు బాలికను గుర్తు పట్టి ఆటోలో జక్కలొద్ది గుడిసెల్లో నివాసం ఉంటున్న నాన్నమ్మ, మేనత్త సాహెద బేగంకు బాలికను అప్పగించారు. అప్పటికే బాలిక తండ్రి ఇమ్రాన్ డయల్ 100 ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీనిపై తల్లిదండ్రులు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ అప్రమత్తమై కిడ్నాప్ కేసు నమోదు చేసి పోలీసులను అప్రమత్తం చేశాడు. బాలిక మేనత్త సాహెద్ బేగం ఇమ్రాన్‌కు ఫోన్ చేసి చెప్పడంతో ఇమ్రాన్ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. కిడ్నాపర్ల కళ్లుగప్పి బాలిక తప్పించుకుని క్షేమంగా ఇంటికి చేరడంతో పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు!
బాలిక కిడ్నాప్ ఘటనలో పంజాబ్‌కు చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతడిని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఇదే విషయమై ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. బాలికను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, ఆకుటుంబానికి సన్నిహితంగా ఉండే ఓవ్యక్తి బంధువుల ఇంటి అడ్రస్ చూపించమని బాలికను ఆటోలో తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇదే విషయం బాలిక స్పష్టంగా చెప్పిందన్నారు. ఇమ్రాన్‌కు సరైన సమాచారం లేక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బ్రేక్ బదులు ఎక్సలేటర్ తొక్కాడు!

- కారు పూజ కోసం వచ్చి బీభత్సం
- ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు ఇదే..

పర్వతగిరి: పర్వతగిరి మండలంలోని ప్రముఖ యాత్రా స్థలం అన్నారం షరీఫ్ దర్గా వద్ద శుక్రవారం కొత్త కారు బీభత్సం సృష్టించింది. ఖమ్మం జిల్లాకు చెందిన రఫీ ఇటీవల కొత్త కారు కొన్నాడు. కారుకు ఫాతెహా (ముస్లిం సంప్రదాయంలో పూజ) చేయించేందుకు షరీఫ్ దర్గాకు వచ్చాడు. దర్గా సమీపంలో కారు నడుపుతుండగా.. భక్తులను తప్పించేందుకు బ్రేక్ వేయబోయి ఎక్సలేటర్ తొక్కాడు. దీంతో కారు మరింత వేగంగా వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న బుచ్చన్న, నందిని, చింటు, దస్రు, మాలతిని ఢీకొట్టడంతో వీరికి గాయాలయ్యాయి. అందులో ములుగు జిల్లా గొస్‌పల్లి గ్రామానికి చెందిన నందినికి ముక్కులో నుంచి రక్తస్రావం కావడంతో నందినితో పాటు గాయాలపాలైన నలుగురిని మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎస్సై దేవేందర్, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని కారు యజమాని రఫీని అదుపులోకి తీసుకున్నారు. బ్రీతింగ్ టెస్ట్ చేయగా.. అతడు మద్యం తీసుకోలేదని తేలింది. కాగా.. అతడికి లైసెన్స్ ఉన్నట్లుగా ఎస్సై గుర్తించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. క్షతగాత్రులను వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు పరామర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాయమాటలు చెప్పి మైనర్‌తో వివాహం

- నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వరంగల్ రూరల్: ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి బలవంతంగా బాలికను పెళ్లి చేసుకుని అత్యాచారానికి పాల్పడిన వరంగల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధి బాలాజీనగర్‌కు చెందిన శీలపాక బన్నిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతడిపై కిడ్నాప్, అత్యాచారం, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏసీపీ వి.సతీశ్‌కుమార్ ఏనుమాముల సీఐ వి.చేరాలు, ఎస్.ఐ శ్రీకాంత్‌పోగుల తెలిపారు.

ఏసీబీ ట్రాప్

- లంచం తీసుకుంటూ పట్టుబడిన ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ సుదర్శన్



ఏసీబీకి చిక్కిన డీఈఈ నవీన్



ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో ఏసీబీ తనిఖీలు



అబీద్‌ఖాన్

ఏటూరునాగారం: ఏటూరు నాగారం ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్‌కు చెందిన ఇద్దరు అధికారులు శుక్రవారం ఏసీబీ వలలో చిక్కారు. 2022 మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో గద్దెలు, సాలహారానికి రంగులు(పెయింటింగ్) వేసిన కాంట్రాక్టర్ సంజీవ వద్ద నుంచి లంచం డిమాండ్ చేయడంతో ఆయన ఏసీబీని ఆశ్రయించాడు. ఐటీడీఏ నుంచి నాలుగు నెలల క్రితమే రావాల్సిన నిధులను ఇంజనీరింగ్ శాఖ అధికారులు అలాట్ చేశారు. అయినా నాలుగు నెలల నుంచి పెయింటర్‌ను అధికారులు కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. విసిగిపోయిన కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో డీఈఈ నవీన్, ఏఈఈ అబీద్ ఖాన్ పెయింటర్ నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అబీద్ ఖాన్ డ్రాఫ్ట్‌మెన్ అయితే ఏఈఈగా పని చేస్తున్నారు. 15 ఏళ్ల నుంచి ఐటీడీఏలో ఏటూరునాగారం, తాడ్వాయి ప్రాంతాల్లో పని చేస్తున్నారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడారం సమ్మక్క సారలమ్మ 2022 జాతరకు గద్దెలు, ఇతర పెయింటింగ్ పనులను ములుగు గ్రామానికి చెందిన పెయింట్ కాంట్రాక్టర్ సంజీవ పనులు చేశాడు. రూ.16.50 లక్షల బిల్లు ఎంబీ రికార్డు చేసి సదరు కాంట్రాక్టర్‌కు డీఈఈ నవీన్, ఏఈఈ అబీద్‌ఖాన్‌లు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు రూ. 90 వేలు లంచం ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేశారు. దీంతో సంజీవ ఈనెల 10న ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. మొదటి దఫాగా రూ.50వేలు ఇస్తానని, మిగతావి తర్వాత ఇస్తానని సదరు ఇంజనీరింగ్ అధికారులతో సంజీవ ఒప్పుకున్నాడు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం ఐటీడీఏ కార్యాలయం వద్ద నవీన్, అబీద్‌ఖాన్ డబ్బులు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రూ. 50వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఏసీబీ డీఎస్పీ, ఏసీబీ సీఐలు శ్యామ్‌సుందర్, రవి, శ్రీనివాస్ ఉన్నారు.

సీసీ పుటేజీల సేకరణ
ఐటీడీఏ కార్యాలయంలోని సీసీ టీవీ పుటేజీలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంజనీరింగ్ అధికారుల కదలికలు, వారిని ఎవరెవరు కలిశారని ఆరా తీస్తున్నారు. గతంలో ఐటీడీఏలో జరిగిన గిరిజన దర్బార్‌లో కూడా తనకు మేడారం బిల్లులు రావాలని సంజీవ వినతి పత్రం అందించారు.

ఏసీబీ వలలో మొదటిసారి!

ఐటీడీఏ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా పనులు చేయాలంటే గుండెధైర్యంతోపాటు జేబులో డబ్బులుండాలి. బిల్లులు పొందాలంటే కాళ్లకున్న చెప్పులు అరగక తప్పదు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో అనేక బిల్లులను ఆపి కాంట్రాక్టర్లను పీడించి వారి నుంచి లంచాలు పెద్ద మొత్తంలో పొందడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. బిల్లులు సజావుగా రావాలంటే టీఏ, ఏఈఈ, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి పైవరకు చేతులు తడపక తప్పదని ఏసీబీకి చిక్కిన అధికారులను చూస్తే అర్థం అవుతోంది. ఐటీడీఏ కార్యాలయంలో ఏళ్ల తరబడి ఇక్కడే మకాం వేయడంతో ఏ కాంట్రాక్టర్ ఎలాంటి వారు... ఏ పనులకు ఎంత కమీషన్ పొందవచ్చనేది వారికి వెన్నతో పెట్టిన విద్యగా మారింది. ఐటీడీఏలో ఉన్న అధికారులను బదిలీ చేసి ప్రక్షాళన చేస్తే గిరిజనులకు అందాల్సిన ఫలాలు, పథకాలు అందవని చర్చ జరుగుతోంది. ఇంకా ఇలాంటి అవినీతి తిమింగలాలు చాలానే ఉన్నాయని సోషల్ మీడియాలో అనేక మంది కాంట్రాక్టర్లు, బాధితులు పోస్ట్ చేయడం కొసమెరుపు.